క్లుప్తంగా

భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న సుల్తాన్‌బాబా, తదితరులు

కడప సెవెన్‌రోడ్స్: వికాస్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో కడప నాగరాజుపేటలోని వినాయక మండపంలో శుక్రవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ సుల్తాన్‌బాబా మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలను నగరవాసులు మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించుకోవడం సంతోషదాయకమన్నారు. ప్రతి ఒక్కరికీ విఘ్నేశ్వరుని ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ షఫీ, రవి, నారాయణ, హర్ష, నాని, మహేష్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

కడప రూరల్: నగరంలోని ఎర్రముక్కపల్లె, కొత్తశివాలయం వీధిలో మహిళలకు శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎర్రబోయిన రమాదేవి మాట్లాడుతూ ప్రతి మహిళ ముగ్గుల పోటీలో పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్రబోయిన రమాదేవి, సాయిగణేష్, సుబ్బరాయుడు, కృష్ణవేణి, బాలసుబ్రహ్మణ్యం, సాయిశిల్ప, జగన్ మోహన్, సాయిబిందు, మహిళలు పాల్గొన్నారు.

వృద్ధులకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

కడప కార్పొరేషన్: కడప సెంట్రల్ జైలు సమీపంలోని చౌడమ్మ వృద్ధాశ్రమంలో పేదలకు సాయి యువజన సేవా సంఘం చైర్మన్ మలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మాధవీరెడ్డి ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ.క్రిష్ణారెడ్డి, గంగాధర్ ఆనంద్‌బాబు, శివ, భాస్కర్ రెడ్డి, ప్రసాద్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభ



హెచ్‌ఎంలను సన్మానిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు కడప డీఈఓ కార్యాలయంలో స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డులను శుక్రవారం అందజేశారు. వరుస స్థానాల్లో నిలిచిన కడప మున్సిపల్ హైస్కూల్ మెయిన్, మైదుకూరు జెడ్పీ హైస్కూల్, ఎర్రగుంట్ల జెడ్పీ హైస్కూల్, దువ్వూరు మాచనపల్లి జెడ్పీ హైస్కూల్, వేముల కొత్తపల్లి జెడ్పీ హైస్కూల్‌ల హెచ్‌ఎం, పీఈటీలకు డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి అవార్డులను అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో అరుణకుమారి, ఎం.ప్రవీణ్‌కిరణ్, సాజిత్, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైవీయూ వీసీ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ పద్మ, తదితరులు

కడప ఎడ్యుకేషన్: వైవీయూ ఆచార్యులు కేఎస్‌వీ.కృష్ణారావు రచించిన కార్బోహైడ్రేట్ పాలిమర్ నానోటెక్నాలజీస్ ఎ డిజైన్ డెవలప్‌మెంట్ యుటిలైజేషన్ అండ్ పర్స్‌పెక్టివ్స్ పుస్తకాన్ని వీసీ అల్లం శ్రీనివాసరావు శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కార్బోహైడ్రేట్ పాలిమర్ నానోటెక్నాలజీల అనువర్తనాలు రోజువారీ జీవితంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. పారిశ్రామిక రసాయన శాస్త్రవేత్తలు, పర్యావరణ శాస్త్రవేత్తలు, ఔషధ శాస్త్రవేత్తలు, గ్రాడ్యుయేట్ విద్యార్థులకు కార్బోహైడ్రేట్ పాలిమర్ నానోటెక్నాలజీల సంక్లిష్ట లక్షణాలు, కార్యాచరణలను అర్థం చేసుకోవడంలో పుస్తకం ఉపయోగపడుతుందని తెలిపారు. సెన్సార్లు, డ్రగ్ డెలివరీ, నానోమెడిసిన్, బయోమెడికల్, ఫోటోకాటల్-వైసిస్, హైడ్రోజన్ నిల్వ, ఆహార ప్యాకింగ్, మరియు బాష్పీభవనం వంటి సంభావ్య పరిశోధన రంగాలను ఇందులో ప్రస్తావించారన్నారు. అనంతరం పుస్తక రచయిత కృష్ణారావును వీసీ అభినందించారు. ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రిన్సిపల్ టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాబ్ ఫెయిర్

కమలాపురం : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నిరుద్యోగులు ప్రతి నెలా నిర్వహించే జాబ్ ఫెయిర్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ కెజియా తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో సీడప్ ఆధ్వర్యంలో ఛానల్ ప్లే లిమిటెడ్ కంపెనీ నిర్వహించిన జాబ్ మేళాకు వివిధ ప్రాంతాలకు చెందిన 31 మంది హాజరయ్యారు. వారిలో 25 మంది నిరుద్యోగులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. పృథ్విరాజ్, కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బొజ్జ గణపయ్యా.. వెళ్లి రావయ్యా



కడప నగరంలో గంగమ్మ ఒడికి చేరిన గణనాథుడు



వినాయక నిమజ్జనం కార్యక్రమంలో పాల్గొన్న విజయదుర్గా కాలనీవాసులు

విద్యుద్దీపాలు, పుష్పాలంకరణ వేదికపై మూడురోజులపాటు వినాయక విగ్రహాలను కొలువుదీర్చిన భక్తులు శుక్రవారం వీడ్కోలు పలికారు. మూడు రోజులు పూజలందుకున్న స్వామిని జిల్లా వాసుల జీవితాలు ఆనందమయం కావాలని కోరుతూ భారీ ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం జరిపారు.

- వందకు పైగా విగ్రహాల నిమజ్జనం
- పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు

కడప సెవెన్‌రోడ్స్ : ఆది పూజల దేవుడు...ఆది దంపతుల సుతుడు...బొజ్జ గణపయ్య నిమజ్జనాన్ని శుక్రవారం భక్తులు వైభవోపేతంగా నిర్వహించారు. బుధవారం పందిళ్లలో ఏర్పాటుచేసిన గణపయ్యల భారీ విగ్రహాలను చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. భక్తులు ఈ కార్యక్రమాన్ని ఉత్సాహ భరితంగా నిర్వహించారు. అంతకుమునుపు దాతల సహకారంతో వినాయక మండపాల నిర్వాహకులు పేదలకు అన్న ప్రసాదం ఏర్పాటుచేశారు. పలు చోట్ల గణపతి చేతిలో పూజలందుకున్న లడ్డూల వేలం పాటలు, ఉట్టికొట్టడం, మహిళలకు ముగ్గుల పోటీలుఏర్పాటు చేసి బహుమతులు ఇవ్వడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

ఉత్సాహంగా...ఉల్లాసంగా

జైబోలో గణేష్ మహరాజ్‌కీ....గణపతి బొప్ప మోరియా..నినాదాలు, తప్పెట్లు, చెక్కభజనలు, బ్యాండుమేళాలు, భక్తి గీతాలాపనలు, యువకుల ఈలలు, కేరింతలు, ఉత్సాహాల మధ్య గణపతి నిమజ్జనం జరిగింది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి నగరంలో గణపతి విగ్రహాల నిమజ్జనం ప్రారంభమైంది. ఈ సందర్భంగా పలుచోట్ల పూజలందుకున్న గణపతి సన్నిధిలో లడ్డూల వేలం పాటలు, ఉట్టి కొట్టడం, మహిళలకు ముగ్గుల పోటీలు, బాలలకు పోటీలను ఏర్పాటుచేసి బహుమతులు ఇచ్చే కార్యక్రమాలు నిర్వహించారు.

విజయదుర్గ కాలనీలో

కడప రూరల్: కడప నగరంలోని విజయదుర్గా కాలనీ 4వ రోడ్డులో శుక్రవారం ఘనంగా వినాయక నిమజ్జనం నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గోవింద నాగరాజు, సుధాకర్, ఏసి కొండారెడ్డి, పల్లా రాధాకృష్ణ,సునీల్ జయంత్, రామయ్య పాల్గొన్నారు.

- సింగపూర్ టౌన్ షిప్ లో ఘనంగా వినాయక నిమజ్జనం జరిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రవికుమార్, కాలనీవాసులు పాల్గొన్నారు.

మూడు రోజులపాటు పందిళ్లలో పూజలందుకున్న గణనాథుని విగ్రహాలను మధ్యాహ్నం నుంచి చెరువులు, నదులు, కాలువలు, కుంటల్లో నిమజ్జనానికి భక్తులు త్సాహంగా తరలించారు. ట్రాక్టర్లు, లారీలు, మినీ క్యారేజ్ లారీలు, ఎడ్లబండ్లలో వినాయక విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. యువకులు, బాలలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో నృత్యాలు చేసుకుంటూ విగ్రహం వెంట నిమజ్జనానికి వెళ్లారు. నగరానికి సమీపంలోని పాత కడప చెరువులో ఈ ఏడాది నీరు పుష్కలంగా ఉండడంతో ప్రజలు

భారీ బందోబస్తు మధ్య విగ్రహాల నిమజ్జనం

ఉత్సాహంగా నిమజ్జనం చేశారు. చెరువు గట్టుపై ప్రత్యేకంగా ఘాట్ల ఏర్పాటుతో ఎలాంటి రద్దీ చోటుచేసుకోలేదు. ఈ చెరువుతోపాటు ఇర్కాన్ సర్కిల్‌లోని కేసీ కెనాల్, ఫాతిమా కళాశాల, వాటర్‌గండి, ఇతర నీటి వనరులుగల ప్రాంతాల్లో నిమజ్జనం చేశారు. జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో విస్తృత



మైన పోలీసు బందోబస్తు నిర్వహించారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది నిరంతరం కార్యక్రమాలను పర్యవేక్షించి పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. విద్యుత్ వల్ల ప్రమాదాలు చోటు చేసుకోకుండా నివారించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. నిమజ్జనానికి వెళ్లే దారిలో కిందికి ఉన్న విద్యుత్ తీగలను సరిచేశారు. నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో అగ్నిమాపకశాఖ సిబ్బంది, గజ ఈతగాళ్లు, బోట్లు అందుబాటులో ఉంచారు. కీలకమైన ప్రదేశాల్లో డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేశారు. నిమజ్జనానికి వెళ్లే దారిలో ఉన్న మద్యం దుకాణాలు మూసివేశారు. అవసరమైన చోట్ల మెడికల్, 108 వాహనాలు సిద్ధంచేసి ఉంచారు. కడప నగరం కృష్ణాసర్కిల్‌తోపాటు నిమజ్జన ప్రాంతాల్లో వినాయక ఉత్సవ కేంద్ర సమితి సభ్యులు ఎప్పటికప్పుడు ప్రత్యేక కౌంటర్ల నుంచి జాగ్రత్తలు చెప్పడంతో నిమజ్జన కార్యక్రమాలు సజావుగా కొనసాగాయి.

ఇది తగునా!



కడపలోని వినాయక విగ్రహాల్లో అధిక భాగం నిమజ్జనం చేసే దేవుని కడప చెరువు వద్ద శుక్రవారం మధ్యాహ్నం నుంచి విగ్రహాలు నిమజ్జనానికి రావడం మొదలైంది. అయితే ఆ ప్రాంతంలోని వైర్లను ముందే సరిచేయాల్సిన విద్యుత్ సిబ్బంది హడావుడిగా పనులు చేపట్టారు. ఒకవైపు వాహనాల్లో విగ్రహాలను తీసుకువస్తుండగా, ఆ సమయంలో కిందికి వేలాడుతున్న విద్యుత్ వైర్లను వేశారు. కొద్దిమేర ఇబ్బందులు ఎదురైనా ఎవరికీ ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విద్యుత్ అధికారుల తీరుపై పలువురు భక్తులు అసహనం వ్యక్తం చేశారు. – తీట్ల రమేష్, సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

అన్నదానం



అన్నదానం చేస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్: నగరంలోని రామరాజుపల్లిలోని వినాయకుడు విగ్రహం వద్ద వైస్సార్సీపీ 48వ డివిజన్ ఇంచార్జి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించారు. ఓబులేసు, ఓబుళరెడ్డి, రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

కో ఆపరేటివ్ కాలనీలో...

కడప కోఆపరేటివ్ కాలనీలోని వినాయకుడు విగ్రహం వద్ద 25వ డివిజన్ నేతల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యనారాయణరావు, ఉషారాణి, నాగరాజు, అఖిలేష్, జగదీష్, మల్లికార్జున, తేజ పాల్గొన్నారు.

కడప కార్పొరేషన్: కడపలోని గరుడాద్రినగర్‌లో 12వ డివిజన్ కార్పొరేటర్ సానపురెడ్డి శివకోటిరెడ్డి, ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, కొరివి సుధాకర్‌రెడ్డి హాజరై అన్నదానాన్ని ప్రారంభించారు. అనంతరం గణేషుడిని నిమజ్జనానికి తరలించారు.ఎస్.సతీష్‌రెడ్డి, ఆర్.సుబ్బారెడ్డి, పి.రవీంద్రారెడ్డి, క్రిష్ణంశెట్టి, హరి పాల్గొన్నారు.



సింగపూర్ టౌన్ షిప్ లో వినాయక నిమజ్జనం లో పాల్గొన్న స్థానికులు



గరుడాద్రి నగర్ వాసుల సంబరాలు

తెలుగు భాషకు గొడుగు పట్టిన గిడుగు



మాట్లాడుతున్న మూలమల్లికార్జునరెడ్డి



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు



పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధికారులు

కడప ఎడ్యుకేషన్: వ్యవహారిక భాష ఉద్యమానికి శ్రీకారం చుట్టి సఫలీకృతుడై తెలుగు భాషకు గొడుగు పట్టిన గిడుగు రామ్మూర్తి పంతులు చిరస్మరణీయులని వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూలమల్లికార్జునరెడ్డి అన్నారు. కడప జ్ఞాన విహార్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మూలమల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులతో ముచ్చటించి పద్యాన్ని ఎలా పాడాలో ఆయన తెలిపారు. అనంతరం విద్యార్థుల నృత్య ప్రదర్శన, పద్యాల పఠన పోటీలు, వ్యాస రచన పోటీలను తిలకించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ డా.రవిశంకర్, ప్రిన్సిపల్ కె.సువర్ణ, డి.కశ్యప్ పాల్గొన్నారు.

సర్వజన ఆమోదయోగ్యం సలీమ్ కవిత్వం

మానవ సంబంధాల్ని తన హృదయంలో సంలీనం చేసుకొని సలీమ్ సర్వజన ఆమోదయోగ్యంగా కవిత లల్లారని ఆచార్య మూలమల్లికార్జునరెడ్డి అన్నారు. ఎస్‌కేఆర్ – ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ వేమల సలీమ్‌బాషా కవిత్వీకరించిన 'సమీచీనం' కవితా సంపుటి పుస్తక పరిచయ సభ శుక్రవారం నిర్వహించారు. మొదట గిడుగు రామ్మూర్తిపంతులు గారి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం సమీచీనం పుస్తకంపై వక్తలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జి.రవీంద్రనాథ్, తవ్వావెంకటయ్య, జీఎల్.లావణ్య, ప్రసాద్, ఎస్‌ఎ.సత్తార్‌ఫైజి, కె.చిన్నపరెడ్డి, నాగసుధారాణి ఖదీరున్నిసా, శ్రీదేవి, అహమ్మద్,పాల్గొన్నారు.

తేనెలొలుకు భాష తెలుగు

కడప ఎడ్యుకేషన్: తేనెలొలుకు భాష తెలుగు అని పాఠ్య పుస్తక ప్రచురణల రాష్ట్ర డైరెక్టర్ మధుసూదన్ రావు అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక వేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని గిడుగు వెంకటరామ్మూర్తిపంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవహారిక భాషోద్యమానికి గిడుగు నాంది పలికారని, వాడుక భాష రాతభాషగా ఉండాలని తెలిపారు. ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అని పిలవబడే తెలుగు భాష విలక్షణమైన ప్రత్యేకత కలిగి ఉందన్నారు. కడప, అన్నమయ్య డీఈవోలు డాక్టర్ షేక్ షంషుద్దీన్, డాక్టర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మాతృభాష మాధుర్యం ఎనలేనిదన్నారు. ఉగ్గుపాలతో నేర్చుకున్న భాష ఎంతో ఉన్నతమైందని తెలిపారు. ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ వీరసుదర్శన్‌రెడ్డి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ గిడుగువెంకటరామమూర్తి పంతులు తెలుగు వ్యవహారిక భాషోద్యమానికి పాటుపడడంతోపాటు నాగరికతకు దూరంగా కొండల్లో జీవిస్తున్న ఆదిమ ప్రజల భాషకు గుర్తింపు తెచ్చారని తెలిపారు. తెలుగు భాషను కాపాడుకోవాల్సిన తక్షణ కర్తవ్యం నేడు ఏర్పడిందని, అందుకు తెలుగు వారందరూ సంసిద్ధులు కావాలని కోరారు.

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కడప నగరంలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి, మేజర్ ధ్యాన్‌చంద్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస మూర్తి మాట్లాడుతూ సవర జాతీయులకు లిపిని తయారు చేసి ఇచ్చిన గొప్ప భాషా శాస్త్రవేత్త రామ్మూర్తి పంతులు అన్నారు. హాకీ మాంత్రికుడు గా పిలవబడే ధ్యాన్ చంద్ క్రీడాభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు మరియు వ్యాయామ విభాగ ఉపాధ్యాయులు విజయశ్రీ,, ప్రసాద్ ద్యార్థులు, పాల్గొన్నారు,

కడప ఎడ్యుకేషన్: తెలుగు బాషకు ప్రాణదాత గిడుగు రామమూర్తిపంతులు అని డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి అన్నారు. కడప అగాడవీధి నగర పాలక ఉర్దూ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, పిల్లలతో కలిసి గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయురాలు సయ్యద్ షాకీరున్నిసా, అనిల్ కుమార్, జుబేర్ అహ్మద్, గౌస్ బాషా, సాజిదాఖానం పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్: మేజర్ ధ్యాన్ చంద్ జీవితం క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవీంద్రనాథ్ అన్నారు. ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ క్రీడలు ప్రతి మనిషి తన జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. ఇటీవల కాలంలో జాతీయ స్థాయిలో మెరిసిన అథ్లెట్లు కె.మహేష్, నీల మహేశ్వరిలనులీ సందర్భంగా సన్మానించారు. అనంతరం కళాశాల క్రీడల పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రమేష్, టి.హజరత్తయ్య, సత్యనారాయణరెడ్డి, సతీష్‌రెడ్డి, పి.నాగరాజు, వెంకటేశ్వర్లు, కల్పన, నాగసులోచన పాల్గొన్నారు.

బద్వేల్ నియోజకవర్గాన్ని కొనసాగించాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లా పరిషత్ సమావేశంలో బద్వేలు నియోజకవర్గాన్ని కడప జిల్లాలో కొనసాగించేలా తీర్మానం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర కోరారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మరో ఆరు జిల్లాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు. మదనపల్లి జిల్లా ఏర్పాటు తెరపైకి రావడంతో అన్నమయ్య జిల్లా కేంద్రాన్ని రాజంపేటకు మారుస్తూ బద్వేల్ నియోజకవర్గం అన్నమయ్య జిల్లాలో కలిపేందుకు ప్రతిపాదనలు రావడంతో ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన చెందుతున్నారని తెలిపారు. రాజంపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో బదేవేల్‌ను కలిపితే కలసపాడు మండల ప్రజలు 150 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తుందన్నారు. ఇసుక ఇష్టారాజ్యంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని, అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని ఆరోపించారు. టిప్పర్లలో మట్టి తరలించడంతో రోడ్లు గుంతలమయమై రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు విష జ్వరాలు ప్రబలుతున్నా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. జిల్లాలో ఎమ్మార్పీ ధరకు మించి యూరియా కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఈ సమావేశంలో వెంకటశివ, జి.మద్దిలేటి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణే మా ధ్యేయం



ప్రతిభ చూపిన అచ్యుత్ రెడ్డి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: పర్యావరణ పరిరక్షణే తమ ధ్యేయమని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ చిన్నారి అచ్యుత్‌రెడ్డి అన్నారు. న్యూఢిల్లీలోని ఎంఎస్ఎన్ సీనియర్ సెకండరీ స్కూల్, ఏఎఫ్ఎస్ ఇండియా నిర్వహించిన వేస్ట్ వైజ్ ఛాలెంజ్ ఇన్నోవేటింగ్ ఫర్ ఎ సస్టైనబుల్ ఫ్యూచర్ – యాప్ డిజైనింగ్ పోటీలో ఆమె పాల్గొని పబ్లిక్ స్కూల్ జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించారు. దేశ వ్యాప్తంగా 24 పాఠశాలలు పాల్గొనగా, అందులో అచ్యుత్‌రెడ్డి ఎకోవర్స్ యాప్ రూపొందించి పోటీలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపల్ అమిత్ సింగ్ తెలిపారు. ఈ యాప్ ఉపయోగం ఏమిటంటే మనం ఏదైనా పదార్థాన్ని ఉపయోగించాలనుకున్నప్పుడు ఈ అనువర్తనానికి ఆ పదార్థం యొక్క చిత్రాన్ని జోడిస్తే పూర్తి వివరాలను అందజేస్తుందన్నారు. ఈ సందర్భంగా అచ్యుత్‌రెడ్డిని ఉప ప్రధానాచార్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.

బాల్య వివాహాలపై అవగాహన అవసరం

కడప ఎడ్యుకేషన్/కడపఅర్బన్: బాల్య వివాహాలు, చిన్న వయసులోనే గర్భధారణ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్.బాబా ఫకృద్దీన్ సూచించారు. కడప చిన్న చౌక్‌లోని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ గిరిజన బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులకు శుక్రవారం పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యాహక్కు చట్టం, ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు సరస్వతి, సుభాష్‌యాదవ్, ఎస్.శాంతమ్మ, రఫీక్‌అహ్మద్, రత్నప్రభ, పీవీ.ప్రసాద్, సుభాష్ చంద్రబోస్, విద్యార్థినులు పాల్గొన్నారు. నగరంలోని బాలాజీ నగర్‌లో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు మనోహర్, రవితేజ శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారిని సంప్రదించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటరీలు, గిరిజనులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి బాబాఫకృద్దీన్

లీగల్ క్లినిక్‌లను సద్వినియోగం చేసుకోవాలి

కడప అర్బన్: ఖైదీలు న్యాయ సహాయం కోసం లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను ఉపయోగించుకోవాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్ అన్నారు. కడప పురుషుల, ప్రత్యేక మహిళల కారాగారాల్లో ఖైదీలకు అవగాహన కల్పించారు. ఖైదీలు, మానసిక వ్యాధిగ్రస్తులు, ఇతర వ్యాధులతో బాధపడుతున్నవారు సకాలంలో మందులను వాడాలని తెలియజేశారు. కార్యక్రమంలో కారాగారం అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

కడప అర్బన్: కడప నగరంలోని రవీంద్రనగర్‌కు చెందిన ఎలక్ట్రిషియన్ చేకూరి శేఖర్‌పై అదే ప్రాంతానికి చెందిన కొందరు యువకులు పాత కక్షలను మనస్సులో పెట్టుకుని దాడి చేశారు. అతన్ని తమతో పాటు తీసుకుని వెళ్లి రామరాజు పల్లి వద్దకు తీసుకెళ్లి దాడి చేసినట్లు బాధితుడు శేఖర్ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ తాహీర్ హుసేన్ కేసు నమోదు చేశారు. నిందితుల కోసం గాలింపు చర్యలను చేపట్టారు.

జిల్లాలో చెరువుల మరమ్మతు పనులకు ఆమోదం

జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని అన్ని మైక్రో ఇరిగేషన్ ట్యాంకులు, కాల్వలకు మరమ్మతులు చేపట్టి.. చివరి ఆయకట్టుకు కూడా సాగునీరు అందించి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి అన్నారు. కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్‌లో నీటి వనరుల మరమ్మతులు, పునర్నిర్మాణం, పునరుద్ధరణ (ట్రిబుల్ దిశ 3) కార్యక్రమంపై ఆయన అధికారులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా నిర్వహణ లేక చెరువులు బురదతో నిండిపోవడంతోపాటు మట్టి కట్టలు ప్రమాణాలకు అనుగుణంగా లేవన్నారు. వాటిపై ఆర్.ఆర్.ఆర్. జిల్లాస్థాయి అమలు – పర్యవేక్షణ కమిటీ ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. జిల్లాలో మొత్తం 42904.12 ఎకరాల ఆయకట్టు కలిగిన 138 నీటిపారుదల ట్యాంకులు ఉన్నాయని, వాటిలో వంద ట్యాంకులకు రిపేర్లు, రినోవేషన్, రిస్టోరేషన్ (ఎంఐ) ఫేస్-3 కార్యక్రమం కింద పనులు చేపట్టేందుకు డీఎల్ఐ – ఎంసి కమిటీ ప్రతిపాదించిదన్నారు. పనుల నిర్వహణ వ్యయం అంచనా రూ.7308.49 లక్షలకు కలెక్టర్ ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ అబ్దుస్ సమీ, ఈఈలు వెంకట్రామయ్య, కె.వి.ఎన్. ప్రసాద్, డ్వామా పీడి ఆదిశేషారెడ్డి, మురళీధర్, అధికారులు పాల్గొన్నారు.

బిజినెస్ రిఫార్మ్ సర్వేలో పాల్గొనండి

కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న బిజినెస్ రిఫార్మ్ సర్వేలో ప్రతినిధులు పాల్గొనేలా చూడాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సూచించారు. బిజినెస్ రిఫార్మ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో శుక్రవారం జిల్లా స్థాయి ఔట్ రీచ్ వర్క్ షాప్ నిర్వహించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. బిజినెస్ రిఫార్మ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా జిల్లాలో వివిధ శాఖల ద్వారా సేవలందుకున్న ప్రతినిధులు ఫాస్ట్ విధానంలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. సేవలందించిన ప్రతినిధులతో వాట్సాప్ గ్రూపుల ద్వారా, ఫోన్ కాల్స్ చేసి బిజినెస్ రిఫారమ్స్ సర్వేపై ముందస్తు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రవితేజ, అధికారులు, పాల్గొన్నారు.